ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు

శనివారం 8 జూన్ 2024





క్రాస్ ఓటింగ్ అత్యల్పం

- కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు 6.58,914
- ఏడు అసెంబ్లీల్లో ఎమ్మెల్యే అభ్యర్థులకు పోలైనవి 6,57,550 ఓట్లు
- 1,364 మందే క్రాస్ ఓటింగ్ వేశారు
- తెలుగుదేశం అభ్యర్థుల్లో కుదిరిన సమన్వయం
- వైసీపీలో భారీగా 36,899 క్రాస్ ఓట్లు
- వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక ఓటు.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మరొకటి..



కర్నూలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు సమన్వయంతో పని చేయడం వల్ల క్రాస్ ఓటింగ్ లేకుండా జాగ్రత్త పడ్డారు. కేవలం 1,364 ఓట్లు మినహా ఓటును సమానంగా బదిలీ చేసుకోవడంతో టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. అదే వైసీపీలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసిన వారు.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి ఓటు వేశారు. సహజంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగినప్పుడు.. క్రాస్ ఓటింగ్ భారీగా జరిగే అవకాశాలు ఉంటాయి. కొన్ని నియోజకవర్గాల్లో 'ఎమ్మెల్యేగా నాకు ఓటు వేసి ఎంపీకి మీ ఇష్టం వచ్చిన వారికి వేసుకొమని' చెప్పవచ్చు.. అదే క్రమంలో ఎంపీ అభ్యర్థులు కూడా 'నాకు ఓటేసి.. ఎమ్మెల్యే అభ్యర్థుల్లో మీ ఇష్టం..' అని చెప్పే అవకాశాలు లేకపోలేదు. ఇందుకు కుల, సామాజిక సమీకరణాలే కారణమవుతాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వాల్మీకి, కురవ సామాజికవర్గాలు బలంగా ఉన్నారు. దీంతో కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా కురవ సామాజికవర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజును బరిలో దింపితే.. వైసీపీ వాల్మీకి సామాజికవర్గానికి చెందిన బీవై రామయ్యను పోటీకి దింపింది. రెండు సామాజికవర్గాలకు చెందిన ఆయా సంఘాల జిల్లా, మండల నాయకత్వం పార్టీలకు అతీతంగా మన కులపోడికే ఓటు వేయాలని.. ఎమ్మెల్యేలకు మీ ఇష్టం అంటూ తెరచాటున విస్తృత ప్రచారం చేశారు. దీంతో క్రాస్ ఓటింగ్ భారీగా జరిగి ఉంటుందని అందరు భావించారు. అయితే.. జూన్ 4న తరువాత వెలువడిన ఫలితాలు, బరిలో నిలిచిన టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు పరిశీలిస్తే.. టీడీపీలో పెద్దగా క్రాస్ ఓటింగ్ జరగలేదని తెలుస్తోంది. అసెంబ్లీ సెగ్మెంట్లలో టీడీపీ కూటమి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కంటే ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు కాస్త ఎక్కువ మాత్రమే ఓట్లు వచ్చాయి. వైసీపీలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అదే క్రమంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పరిశీలిస్తే ఉద్యోగులు టీడీపీ కూటమికే జై కొట్టారు.

వైసీపీలో భారీగా...



అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు, పార్లమెంట్ పరిధిలో ఎంపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు పరిశీలిస్తే ఆ పార్టీలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు 5,47,616 ఓట్లు పోలయ్యాయి. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో వైసీపీ అభ్యర్థులు కర్నూలు అభ్యర్థి ఎంఏ ఇంతియాజ్‌కు 72,814 ఓట్లు, మంత్రాలయం అభ్యర్థి వై.బాలనాగిరెడ్డికి 87,662, ఆలూరు అభ్యర్థి బి. విరుపాక్షికి 1,00,264 ఓట్లు, ఎమ్మిగనూరు అభ్యర్థి బుట్టా రేణుకకు 87,252 ఓట్లు, పత్తికొండ అభ్యర్థి కంగాటి శ్రీదేవికి 84,638 ఓట్లు, ఆదోని అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డికి 71,765 ఓట్లు, కోడుమూరు (ఎస్సీ) అభ్యర్థి ఆదిమూలపు సతీశ్‌కు 80,120 ఓట్లు కలిపి 7 సెగ్మెంట్లలో వైసీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు 5,83,568. ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు వచ్చిన ఓట్ల కంటే ఎమ్మెల్యేల అభ్యర్థులకు 36,899 ఓట్లు అధికంగా వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే వైసీపీ నుంచే భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు 45,849 ఓట్లు పోలైతే.. ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్‌కు 70,373 ఓట్లు వచ్చాయి. అంటే ఎమ్మెల్యేలకు వైసీపీకి ఓటేసిన ఓటర్లు కొందరు ఎంపీ కాంగ్రెస్‌కు ఓటు వేశారు. నోటాకు అసెంబ్లీల్లో 15,260 మంది ఓటు వేస్తే.. పార్లమెంట్ పరిధిలో 10,511 మంది ఓటేశారు. ఇక్కడ కూడా ఎంపీకి ఓటేసినవారు దాదాపు 5 వేల మంది ఎమ్మెల్యేలను తిరస్కరించి నోటాకే వేసినట్లు తెలుస్తోంది.





నియోజకవర్గాల వారిగా పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

నియోజకవర్గం	టీడీపీ	వైసీపీ
ఆదోని	986	468
మంత్రాలయం	328	251
ఆలూరు	836	479
కర్నూలు	2,499	1,037
పత్తికొండ	1,231	689
కోడుమూరు (ఎస్సీ)	1,525	702
ఎమ్మిగనూరు	1,877	856
మొత్తం	9,192	4,482
శాతం	64.06	31.23

నియోజకవర్గం వారిగా టీడీపీ, వైసీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	ఓడిన అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
కర్నూలు	టీజీ భరత్	టీడీపీ	91,690	ఎంఏ ఇంతియాజ్	వైసీపీ	78,814
పత్తికొండ	కేఈ శ్యాంబాబు	టీడీపీ	98,849	కంగాటి శ్రీదేవి	వైసీపీ	84,638
కోడుమూరు(ఎస్సీ)	బొగ్గుల దస్తగిరి	టీడీపీ	1,00,703	ఆదిమూలపు సతీశ్	వైసీపీ	80,120
ఎమ్మిగనూరు	బీవీ జయనాగేశ్వరరెడ్డి	టీడీపీ	1,03,089	బుట్టా రేణుక	వైసీపీ	87,252
ఆదోని	డాక్టర్ పార్థసారధి	బీజేపీ	89,929	వై.సాయిప్రసాద్‌రెడ్డి	వైసీపీ	71,765
పాణ్యం	గౌరు చరిత	టీడీపీ	1,41,272	కె.రాంభూపాల్‌రెడ్డి	వైసీపీ	1,00,681
మంత్రాలయం	ఎన్.రాఘవేంద్రరెడ్డి	టీడీపీ	74,857	వై.బాలనాగిరెడ్డి	వైసీపీ	87,662
ఆలూరు	బి.వీరభద్రగౌడ్	టీడీపీ	97,433	బి.విరుపాక్షి	వైసీపీ	1,00,264
మొత్తం	--	టీడీపీ	6,57,550	--	వైసీపీ	5,84,515
కర్నూలు పార్లమెంట్	బస్తిపాటి నాగరాజు	టీడీపీ	6,58,914	బీవై రామయ్య	వైసీపీ	5,47,616
తేడా	--	టీడీపీ	1,364	--	వైసీపీ	36,899

● క్రాస్ ఓటింగ్ 1,364 ఓట్లే:

కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు 6,58,914 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి బీవై రామయ్యపై 1,11,298 ఓట్ల భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. ఇంతటి విజయం అందుకు ఆయనకు భారీగా క్రాస్ ఓటింగ్ పడి ఉంటుందని అంచనా వేశారు. టీడీపీ కూటమికి చెందిన కర్నూలు అభ్యర్థి టీజీ భరత్‌కు 91,690 ఓట్లు, కోడుమూరు (ఎస్సీ) అభ్యర్థి బొగ్గుల దస్తగిరికి 1,01,703 ఓట్లు, ఎమ్మిగనూరు అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డికి 1,03,089 ఓట్లు, మంత్రాలయం టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డికి 74,857 ఓట్లు, పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు 98,849 ఓట్లు, ఆదోని సెగ్మెంట్ నుంచి టీడీపీ కూటమి తరఫున పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథికి 89,929 ఓట్లు, ఆలూరు టీడీపీ అభ్యర్థి బి. వీరభద్రగౌడ్‌కు 97,433 ఓట్లు కలిపి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కూటమి అభ్యర్థులకు 6,57,550 ఓట్లు వచ్చాయి. ఎంపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లతో పోలిస్తే కేవలం 1,364 ఓటర్లు మాత్రమే బస్తిపాటి నాగరాజుకు ఎక్కువగా వేశారు. అసెంబ్లీ, లోక్‌సభ టీడీపీ అభ్యర్థులు సమన్వయంతో పని చేయడంతో క్రాస్ ఓటింగ్ సమస్య లేకుండా చేసుకున్నారు. అయితే కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో ఎంపీ అభ్యర్థి కంటే ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు రాగా.. పత్తికొండ, కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే ఎంపీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.

కూటమికి జై కొట్టిన ఉద్యోగులు

ఉద్యోగులు టీడీపీ కూటమికే జై కొట్టారు. 23,088 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గాను 14,349 ఓట్లు కౌంటింగ్ చేశారు. టీడీపీకి 9,192 ఓట్లు (64.06 శాతం) వేస్తే వైసీపీకి 4,482 మంది (31.23 శాతం) ఉద్యోగులు ఓటు వేశారు. వైసీపీకి ఓటు వేసినవారిలోనూ అత్యధికంగా గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులే అన్నట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థికి 430 మంది (2.99 శాతం), నోటాకు 108 మంది (0.99 శాతం) ఉద్యోగులు ఓటు వేశారు.

వైసీపీ విధేయుల్లో వణుకు

- వైసీపీ ఏజెంట్లుగా అధికారులు, సీసీలు
- పైసలివ్వనిదే.. కదలని ఫైల్స్
- చిన్న పనికి ఒక రేటు.. పెద్ద పనికి వాటా
- సామాన్య ప్రజలకు దొరకని అధికారుల అనుమతి
- గంటల తరబడి అధికారుల కోసం ప్రజల నిరీక్షణ
- ప్రభుత్వం మారడంతో వేటు పడే అవకాశం

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యతను కనబరిచిన తెలుగుదేశం పార్టీ మరో నాలుగు రోజుల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. టీడీపీ అధికారంలోకి రాకముందే కొందరు ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. ఐదేళ్లలో వైసీపీ హయాంలో కొందరు ఉద్యోగులు ఆ పార్టీ నాయకులకు వీరవిధేయులుగా కొనసాగారు. ఇప్పుడు వారి వెన్నులో వణుకు మొదలైంది. విచక్షణ కోల్పోయి అధికార దర్పాన్ని ప్రదర్శించిన వారు ఇప్పుడు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయినప్పటికీ జిల్లాలో కొందరు వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన జిల్లా అధికారులు, సీసీలపై వేటు పడటం ఖాయమైంది. ఈ నేపథ్యంలో వారు జాగ్రత్తగా సర్దుకుంటున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని గ్రామ సచివాలయ అధికారి నుంచి ఉన్నతాధికారి వరకు దాదాపు వంద మంది వైసీపీ ఏజెంట్లుగా పని చేస్తున్నారు. వీరు అడ్డూ అదుపు లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారు. పైసలిస్తేనే ఫైళ్లు వీళ్ల పనులు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. సస్పెండ్ అయిన ప్రతి ఉద్యోగి మరల ఉద్యోగంలో వెళ్లాలన్నా సీసీల అనుమతి పొందాల్సిందే అనే విమర్శలున్నాయి. చిన్న పనికి ఒక రేటు, పని పెద్దదైతే వాటా ఇవ్వాల్సిందే అని హుకుం జారీ చేస్తున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలకు ఎక్కడికి వెళ్లినా ఎమ్మెల్యే లెటరు ఉండాలని, లేదా ఎమ్మెల్యేతో ఫోన్ చేయించండని బహిరంగంగానే వీరు అనేవారనే విమర్శలు ఉన్నాయి. సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఉన్నత స్థాయి అధికారికి వినతి పత్రం ఇవ్వాలన్నా, రుసుం చెల్లించుకునే పరిస్థితి ఉండేది. కార్యాలయంలో సీసీలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నా జిల్లా ఉన్నతాధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.



టీడీపీ నాయకులతో అధికారుల రాయబారాలు

వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా కొంత మంది అధికారులు విచక్షణోల్పోయి ప్రభుత్వానికి వీర విధేయులుగా పని చేశారు. మరికొందరు వైసీపీనే శాశ్వతంగా అధికారంలో ఉంటుందన్న భ్రమలో పడి ప్రతిపక్ష పార్టీలను టార్గెట్ చేసి వేధించారు. మరికొందరు అధికారులైతే వైసీపీ నాయకుల కంటే అత్యుత్సాహంతో పని చేశారు. జూన్ 4న వెలువడిన ఫలితాలతో రాష్ట్రంలో వైసీపీ తుడిచి పెట్టుకుపోయిందని చెప్పవచ్చు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి, ఆ తర్వాత వైసీపీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు భారీ విజయం సాధించారు. ఈ తరుణంలో వైసీపీ వీర విధేయులైన అధికారులు మూడు, నాలుగు రోజులుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ప్రస్తుతం వారు పని చేస్తున్న ప్రాంతాల్లో ఉండటం కంటే వేరే చోటుకు వెళ్లిపోవడం మేలని భావిస్తున్నారు. మరి కొంత మంది అధికారులు ఇప్పటికే తట్టాబుట్టా సర్దుకునే పనిలో ఉన్నారు. మరికొందరైతే తెలుగుదేశం పార్టీ నాయకులకు టచ్‌లోకి వచ్చి రాయబారాలు నడుపుతున్నారు. ఐదేళ్లలో కొంత మంది అధికారుల పనితీరు సామాన్యులకు పెట్టిన ఇబ్బందులు ప్రతిపక్ష నాయకులను వేధించిన తీరు గుర్తు పెట్టుకున్న కార్యకర్తలు మాత్రం తమకు ఇబ్బంది పెట్టిన వారికి నాయకులు సహకరిస్తే సహించేది లేదని ఖరాకండిగా చెబుతున్నారు.

వైసీపీ ఏజెంట్లను బదిలీ చేయాలి

వైసీపీ ప్రభుత్వంలో తమను ఇబ్బంది పెట్టిన అధికారులను బదిలీ చేయాలని టీడీపీ కార్యకర్తలు కోరుతున్నారు. ఈ ఐదేళ్లలో ఇబ్బందులు పెట్టిన పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులకు సహకరించి తీసుకొచ్చినా, ఇక్కడున్న వారిని కొనసాగించినా వ్యతిరేకిస్తామని కార్యకర్తలు బహిరంగంగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ, సెబ్, మున్సిపల్ శాఖల్లోని అధికారులపై తీవ్రమైన ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇలాంటి వీర విధేయులైన అధికారులకు ఈ నెల 4వ తేదీ నుంచి వణుకు మొదలైందని చెప్పవచ్చు.

వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

- కార్యకర్తలకే ప్రాధాన్యమివ్వండి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో నారా లోకేశ్



మంత్రాలయం, జూన్ 7: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించడంతో రాయలసీమలో అధిక సీట్లు దక్కించుకున్నందుకు టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని తాడేపల్లిలో చంద్రబాబు నివాసంలో నారా లోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ పలు సమస్యలపై చర్చించారు. కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్రలో చాలా మంది రైతు కూలీలు, రైతులు వలసలు వెళ్తున్న దృశ్యాలను చూసి తాను చలించానని లోకేశ్ అన్నారు. ఇప్పటికీ కర్నూలు జిల్లాలోని వలసలు తన మదిలో అలాగే మెదులుతూ ఉన్నాయన్నారు. అందుకోసమే వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని లోకేశ్ తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం కర్నూలు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి వలసల నివారణకు కృషి చేస్తామని లోకేశ్ హామీనిచ్చారు. జిల్లాలో టీడీపీ కార్యకర్తలను కాపాడుకుంటూ అండగా ఉండాలని తిక్కారెడ్డిని లోకేశ్ సూచించారు. కర్నూలు జిల్లాలో మెజార్టీ స్థానాలు సాధించడంలో కీలక భూమిక పోషించిన తిక్కారెడ్డితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలను లోకేశ్ అభినందించారు. ఎలాంటి గొడవలు, అల్లర్లు లేకుండా చూడాల్సిన బాధ్యత తిక్కారెడ్డిపై ఉందని యువనేత సూచించారు.

మేఘమా.. బురుజుపై అందమా..!

కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజును నీలి మేఘాలు కమ్మేశాయి. కమ్ముకున్న కారు మబ్బులు కొండారెడ్డి బురుజుతోపాటు నగరంపై దుప్పటిలా పరుచుకున్నాయి. కొండారెడ్డి బురుజు నుంచి నగరాన్ని తొంగి చూస్తున్నాయా అన్నట్టుగా ప్రకృతి తన రమణీయ దృశ్యాన్ని ఆవిష్కరించింది. శుక్రవారం ఈ మేఘాల సమూహం నగర వాసులకు మధురానుభూతిని అందించాయి. - కర్నూలు.



రాష్ట్రపతిని కలిసిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ద్రౌపదిముర్మును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

-ఆదోని

నారా లోకేశ్‌ను కలిసిన టీజీ భరత్



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ కలిశారు. విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాయలసీమలో కూటమి భారీ విజయం సాధించడంపై లోకేశ్‌తో చర్చించినట్లు టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నియోజకవర్గంలో 25 ఏళ్ల తర్వాత తెలుగుదేశం పార్టీ గెలవడంపై నారా లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు.

- కర్నూలు అర్బన్


మండగిరి సర్వే నెంబర్ 480ఏ, 481లో ఉన్న ఓపెన్ సైట్‌లో అక్రమణదారులు పాతిన బండలు

ఖాళీ స్థలమా? కబ్జా చేసెయ్..!

- బండలు పాతి ఆక్రమించుకోవడమే
- కబ్జా స్థలం రూ.4 కోట్ల పైమాటే

ఆదోని, జూన్ 7: ఖాళీ ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు, కబ్జాదారులకు పండగే. పండగ. స్థలాలను ఆక్రమించుకుని కట్టడాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. గత ఐదేళ్లుగా జిల్లాలో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాల దురాక్రమణ జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ, రెవెన్యూ అధికారులు సైతం చూసీ చూడనట్లుగా ఉదాసీనంగా వ్యవహరించడంతో విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంత మయ్యాయి. ఆదోని పట్టణానికి ఆనుకుని ఉన్న మండగిరి గ్రామ పంచాయతీ పరిధి బైపాస్ రోడ్డులోని శ్రీనివాస, పద్మావతి ఎస్టేట్‌లో సర్వే నెంబర్ 480ఏ, 481లో 40 సెంట్ల స్థలం ఓపెన్ సైట్‌గా ఉంది. అందులో ఆ కాలనీ సంబంధించిన పార్కు, దేవాలయాలు, తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఓపెన్ సైట్ ఉంచారు. ఇందులో ఎలాంటి కట్టడాలకు వీలులేదు. ఇలాంటి ఓపెన్ సైట్‌లో కొంత మంది కాంపౌండ్ కోసం గుంతలు తవ్వి బండలు పాతారు. కాలనీలో నివసిస్తున్న వారు ఓపెన్ సైట్‌లో ఎలా కాంపౌండ్ నిర్మిస్తున్నారని ప్రశ్నించగా.. తమకు 2004లోనే పట్టాలు ఇచ్చారని చెప్పారు. వైసీపీని అడ్డం పెట్టుకుని కొంత మంది లీడర్లు ఆ స్థలానికి పట్టాలు ఇచ్చినట్లు సృష్టించి, కబ్జా చేసేందుకు ఈ ఎత్తుగడలు వేసినట్లు తెలుస్తోంది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం, కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడం ఆదోనిలో అనవాయితీగా మారింది. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని కబ్జాదారులు దర్జాగా అక్రమ కట్టడాలు చేపడుతున్నా అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ఆదోనిలో చాలా చోట్ల ఆక్రమణలు పెరిగిపోయాయి. సాధారణంగా రస్తా, వంక పోరంబోకులో ఎటువంటి కట్టడాలు చేపట్టరాదు. ఇది చట్టరీత్యా నేరం. ఒకవేళ పట్టాలిచ్చినా అవి చెల్లవు. ఈ నిబంధనలను ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలను చేపట్టి, నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. భారీ స్థాయిలో పంచాయతీ, రెవెన్యూ అధికారులకు నజరానా ముట్టజెప్పడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిస్తున్నాయి. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

ఇది ఇలా ఉండగా.. ఆదోని పట్టణంతో పాటు, మండగిరి పంచాయతీలో ఆక్రమణలు అధికమయ్యాయి. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఆర్ఐ మండిగిరి పంచాయతీలో ఉన్న వంక పోరంపోకు భూములను గుర్తించి, వాటికి పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు కూడా అప్పటి ఎమ్మెల్యే సహాయ సహకారాలతో అధికార వైసీపీకి చెందిన కొంతమంది నాయకులకు పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఇందులో కొంత మంది విలేకరులు కూడా తమ పరపతిని ఉపయోగించి, కొంత నగదును ఆ రెవెన్యూ అధికారికి అందజేసి పట్టాలు తీసుకున్నట్లు సమాచారం. జిల్లా అధికారులు చొరవ చూపి ఇలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకొని అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సర్వే నెంబర్ 480ఏ, 481లో 40 సెంట్ల ఓపెన్ సైట్‌లో 12 మందికి 2004లో పట్టాలు ఎలా ఇచ్చిందీ తెలియదని అన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని వివరణ ఇచ్చారు.


ఆక్రమణదారులు పాతిన బండలు

మీదివేములలో ఇరువర్గాల ఘర్షణ

ఓర్వకల్లు, జూన్ 7: మండలంలోని మీదివేముల గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకులు కార్యకర్తల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం టీడీపీ విజయంతో కార్యకర్తలు బాణాలు పేలుస్తుండగా.. బోయ, గొల్ల కులస్థుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్పర్థలు పెంచుకుని ఒకరికొకరు దాడులు చేసుకోవడంతో పదిమందికి పైగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. గ్రామాన్ని ఎస్ఐ రాజారెడ్డి సందర్శించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

హేమచంద్రారెడ్డి అక్రమాలపై విచారణ జరపాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 7: ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని శుక్ర వారం విజయవాడ కేంద్రంలోని ట్రైబల్ ప్రజా సమాఖ్య కార్యాల యంలో జరిగిన మీడియా సమావేశంలో టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఆకులప్ప నాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలను యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు యూనివర్సిటీలుగా మార్చి కోట్లాది రూపాయలను దోచుకుంటున్నారని అన్నారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఐసీటీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించడం చట్ట వ్యతిరేకం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఐదేళ్ల పాలనలో దాదాపు రూ.150 కోట్ల అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్ హేమచంద్రరెడ్డి, ఇతర అధికారుల మీద చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి ఉన్నత విద్యామండలిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన వైసీపీ వర్గీయులు

- మెజార్టీ తగ్గిందని టీడీపీ కార్యకర్తలపై దాడి
- ఐదుగురికి గాయాలు
- మూడు బైక్‌లు ధ్వంసం


పగలగొట్టిన బైక్

కోడుమూరు (రూరల్), జూన్ 7: మండలంలోని గోరంట్ల మజరా కొత్తపల్లి గ్రామంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. టీడీపీ వర్గీయులపై దాడులకు తెగబడ్డారు. దీంతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. 3 బైక్‌లు ధ్వంసం చేశారు. బాధితుల వివ రాల ఇవి. శుక్రవారం సాయంత్రం వైసీపీ శ్రేణులు మద్యం సేవించి గ్రామ వీధుల్లో పెద్దశబ్దంతో బైక్ లపై తిరిగారు. ఈలలు, కేకలతో జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. దీంతో ఊర వాకిలి దగ్గర టీడీపీ వర్గీయుడు చిన్నమద్దిలేటి కలుగజేసుకుని ఎన్నికలు అయిపోయాయి కదా.. ఇప్పుడు ఇదంతా ఎందుకు అన్నందుకు దాడి చేసి కొట్టారు. ఈ ఘటనను దూరం నుంచి గమ నించిన టీడీపీ కార్యకర్తలు విడిపిం చడానికి వెళ్లగా.. గ్రామంలో వైసీ పీకి మెజార్టీ ఎక్కువ రాలేదని మూకుమ్మడిగా రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. మూడు బైక్‌లను ధ్వంసం చేశారు. వైసీపీ దాడిలో టీడీపీ వర్గీయులు పసుల రాధా క్రిష్ణ, హోటల్ గిడ్డయ్య, మిషన్ గిడ్డయ్య, బాలమద్దిలేటి, చిన్నగి డ్డయ్య అనే ఐదుగురు గాయప డ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుప త్రికి తరలించారు. టీడీపీ ప్రతిఘట నలో వైసీపీకి చెందిన ఒకరికి గాయాలు అయినట్లు తెలిసింది.


గాయపడిన పసుల రాధాక్రిష్ణ

ఎంపీల సమావేశంలో బస్తిపాటి నాగరాజు

- చంద్రబాబును కలిసిన కర్నూలు ఎంపీ
- ప్రధాని మోదీతో సెల్ఫీ





కర్నూలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో శుక్ర వారం జరిగిన ఎన్డీఏ ఎంపీల సమావేశానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. పాత పార్ల మెంట్ భవనంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరి గిన సమావేశానికి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్ర బాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో పాటు ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులుగా పోటీ చేసి గెలిచిన 21 మంది ఎంపీలు హాజరయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి ముందు టీడీపీ అధినేత చంద్రబాబును బస్తిపాటి నాగరాజు కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీగా ఘన విజయం సాధించిన నాగరా జును చంద్రబాబు అభినందించారు. ఎంపీటీసీ నుంచి ఎంపీగా పార్లమెంట్‌లో అడుగు పెట్టావు... బాధ్యతగా పని చేసి కర్నూలు అభి వృద్ధికి పాటుపడాలని బాబు సూచించారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని మోదీతో నాగరాజు సెల్ఫీ దిగారు. తొలిసారిగా ఎంపీగా పార్లమెంట్‌కు వచ్చారు.. మంచిపేరు తెచ్చుకో వాలని ప్రధాని సూచించారు.

గాజులదిన్నెకు 1100 క్యూసెక్కుల వరద

ప్రస్తుతం 0.7 టీఎంసీల నీరు మాత్రమే నిలువ


ప్రాజెక్టులో ఉన్న నీరు

గోనెగండ్ల, జూన్ 7: గాజులదిన్నె ప్రాజెక్టుకు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా 1100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 0.7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు తెలుపుతున్నారు. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు అయితే ప్రస్తుతం 0.7 టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఈ ప్రాజెక్టు కింద 25వేల ఎకరాలు సాగు భూమి ఉంది. గత రెండేళ్లుగా జూన్ చివరి నాటికి ప్రాజెక్టులో వరద నీరు పుష్కలంగా వచ్చి చేరింది. ఈ ఏడాది జూన్ దాటినా ఇప్పటికీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురియక పోవడంతో వరద నీరు వచ్చి చేరలేదు. దీంతో ప్రాజెక్టు వెలవెల పోతోంది. ఈ ప్రాజెక్టు కింద డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతున్నది. ప్రాజెక్టులో వరద నీరు వచ్చి చేరితేనే ప్రాజెక్టు కింద ఆయకట్టు భూములు పంట సాగుతో కళకళలాడుతాయి. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

పుష్ప తరహాలో అక్రమ మద్యం వ్యాపారం

30 జాన్సన్ ఒరిజినల్ ఛాయిస్ బాక్స్‌లను పట్టుకున్న పోలీసులు


మద్యంను పట్టుకున్న పోలీసులు

గోనెగండ్ల, జూన్ 7: పుష్ప సినిమా తరహాలో మండలంలో అక్రమ మద్యం వ్యాపారం జరుగుతోంది. గూడ్స్ వాహనంలో వెనుక వైపు ఇతరులకు కనబడకుండా మద్యం బాక్స్‌లకు ప్రత్యేక ర్యాక్ తయారు చేసి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఇలాంటి ఏర్పాటు ఉన్న బొలేరో గూడ్స్ వాహనాన్ని గోనెగండ్ల, గంజహళ్లి గ్రామం మధ్య ఎల్లెల్సీ కాలువ దగ్గర పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. వాహనంలో ఉన్న పెద్దమరివీడు గ్రామానికి చెందిన మిన్నల్ల, పులకుర్తి గ్రామానికి చెందిన షేక్షావలి అక్రమ మద్యాన్ని, వాహనాన్ని వదలి పారిపోయారు. దీంతో పోలీసులు టీఎస్-15-యూబీ-0913 నెంబర్‌గల వాహనాన్ని, అందులో ఉన్న 30 జాన్సన్ ఒరిజినల్ చాయిస్ బాక్స్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పారిపోయిన ఇద్దరి పట్టుకుంటామని సీఐ రామకృష్ణయ్య తెలిపారు.

పెద్దాసుపత్రిలో ఈ-డిజిటల్ ఓపీ కౌంటర్


ఈ. డిజిటల్ ఓపీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 7: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ-డిజిటల్ ఓపీ కౌంటర్‌ను శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతి రోజూ 3వేల మంది ఔట్ పేషెంట్లు వస్తుంటారని, వీరి కోసం నాలుగు ఓపీ కౌంటర్లు, పీడియాట్రిక్, గైనిక్ విభాగాల్లో ఓపీ కేంద్రాలున్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్, ఈ-డీజిటల్ ఓపీ కౌంటర్‌ను ప్రారంభించామని, దీని వల్ల రోగులకు క్యూలైన్లలో ఎక్కువ సేపు నిలబడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. స్మార్ట్ ఫోన్ ద్వారా డిజిటల్ స్కాన్ అండ్ షేర్ ద్వారా ఏటీఎం, ఫోన్‌పే, ఆభా యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఓపీ టోకెన్ నెంబర్ ద్వారా ఓపీ జనరేట్ అవుతుందన్నారు. ఇం దులో కేవలం ఒక నిమిషం వ్యవధిలో ఓపీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో ఇవి కాకుండా అదనంగా మరో ఓపీ కౌంటర్లు త్వరలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డా.పద్మ విజయశ్రీ, ఏఆర్ఎంవో డా. వెంకటరమణ, హాస్పిటల్ అడ్మిని స్ట్రేషన్ అధికారులు డా. శివబాల, డా. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అత్తింటివారే చంపారని తల్లిదండ్రుల ఆరోపణ


ఖైరున్నిసా (ఫైల్)

పగిడ్యాల, జూన్ 7: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్ర వారం జరిగింది. గ్రామానికి చెందిన దూదేకుల కాసీం, సాలమ్మల కుమారుడు సలీమాలిక్‌తో కర్నూలు జిల్లా దేవమాడ గ్రామానికి చెందిన పెద్ద శాలు, ఖాసీంబీల కుమార్తె ఖైరున్నిసా (26)కు ఐదేళ్ల కింద పెళ్లయిందది. వివాహ సమయంలో కట్నం కింద రూ. 50వేలు, 8 తులాల బంగారం ఇచ్చారు. గురువారం రాత్రి ఖైరు న్నీసా తల్లిదండ్రులు ఫోన్ చేసి కూతురిని పుట్టింటికి తీసుకొనిపోయేందుకు వస్తామని అల్లుడితో చెప్పారు. అయితే ఆయన రావద్దని చెప్పాడు. ఆ తర్వాత ఏం జరిగిందోగాని తెల్లవారుజామున గదిలో ఖైరున్నిసా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఖైరున్నిసా ఎంత సేపటికి బయటికి రాకపోవడంతో కు టుంబ సభ్యులకు అనుమానం వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపిం చింది. ఈ విషయాన్ని మృతురాలి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు గ్రామా నికి వచ్చి చూసి తమ కూతురిని అత్తరింటివాళ్ళే చంపి ఉరివేసుకున్నట్లు చిత్రీ కరిస్తున్నారని అన్నారు. పెళ్లి అయినప్పట్టి నుంచి తమ కూతురిని అత్తింటి వాళ్ల నిత్యం వేధిస్తున్నారని ఆరోపించారు. ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని మహిళ ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసు కున్నారు. భర్త సలీమా మాలిక్, అత్త సాలమ్మలను పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.

15న జిల్లా స్థాయి విలువిద్య ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 7: స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు అండర్-10, 13, 15 విభాగాలలో జిల్లా స్థాయి విలువిద్యలో ఎంపిక పోటీలు, టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి కె.నాగరత్నమయ్య శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి విలు విద్య పోటీల్లో పాల్గొంటారని అన్నారు. వివరాల కోసం 9393855460, 9032104158 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ సైలెంట్ కిల్లర్

- ఏటా పెరుగుతున్న కేసులు
- సకాలంలో గుర్తించకపోతే ముప్పు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే




కర్నూలు(హాస్పిటల్), జూన్ 7: మానవ శరీరంలో మెదడు కీలకమైన అవయవం. బ్రెయిన్ ట్యూమర్ సైలెంట్ కిల్లర్‌గా మారుతోంది. ఏటా కొత్తగా 12వేల మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఈ జబ్బు ప్రాణాలు తీసే వరకు బయట పడడం లేదని, బ్రెయిన్ ట్యూమర్ వచ్చిన వారిలో 3వ వంతు మంది ఐదేళ్లలోపే మరణిస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. అవగాహన లోపం వల్ల మెదడులోని కణితులను ప్రారంభ దశలో గుర్తించలేకపోతున్నారు. ముఖ్యంగా 25 నుంచి 35 ఏళ్ల లోపు వారే ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తుంది.

ఈ ఏడాది థీమ్: ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక కొత్త లక్ష్యం ప్రకటించుకుంది. ఈ ఏడాది అందరం కలిసి మెదడు కణితుల ద్వారా ప్రభావితమైన వారి జీవితాల్లో మార్పు చేయవచ్చు అన్న నినాదంతో ముందుకెళ్తుంది.

లక్షణాలు :

- తలనొప్పి
- తలలో ఒత్తిడి
- ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి
- వికారం, వాంతులు
- కళ్లు సరిగ్గా కనబడకపోవడం
- కాళ్లు, చేతులు బలహీనపడటం

- **మెదడు పనితీరు మందగిస్తుంది:** మెదడులో సాధారణంగా పాత కణజాలాలు పోయి కొత్త కణజాలాలు సృష్టి నిరంతరంగా జరుగుతుంది. ఈ ప్రక్రియలో పాత కణజాలాలు పూర్తి పోకుండా మిగిలిపోతే బ్రెయిన్ ట్యూమర్ (మెదడు కణతులు) వచ్చే అవకాశముంది. ఈ కణితులను ఆలస్యం చేస్తే ట్యూమర్ కణాలు వాటి సంఖ్యను పెంచుకుంటూ పోతాయి. ఫలితంగా ట్యూమర్ సైజు పెరిగి ప్రమాకరంగా మారుతుంది.
- **మెదడులో కణితుల రకాలు :** మెదడులోని కణజాలాల్లో ఏర్పడితే దాన్ని బ్రెయిన్ ట్యూమర్ అంటారు. ఇవి రెండు రకాలు. ప్రైమరీ, సెకండరీ బ్రెయిన్ ట్యూమర్‌లు. ప్రైమరీ బ్రెయిన్‌ను నాలుగు విభాగాలుగా విభజించాలి. సెకండరీ బ్రెయిన్ ట్యూమర్లు, శరీరంలో వివిధ విభాగాల్లో సోకుతాయి. అవి రక్తంలో ప్రవేశించి మెదడులో చేరుతాయి.దీని ద్వారా మెదడులో కణితులు ఏర్పడుతాయి. రేడియేషన్ ద్వారా కూడా ఈ కణతులు ఏర్పడుతాయి.



ఆసుపత్రిలో మెరుగైన చికిత్స



న్యూరో సర్జరీ ఓపీ ప్రతి బుధ, శనివారాల్లో ఉంటుంది. ప్రతి ఓపికి 250 నుంచి 350 మంది రోగులు వస్తుంటారు. ఈ ఓపికి మూడు నుంచి నాలుగు కేసులు వస్తుంటాయి. ఎంఆర్ఐ, సిటీ స్కాన్ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించి చికిత్స అందిస్తున్నాం.

- డా.మోహన్ శశాంక్, న్యూరోసర్జన్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి

బ్రెయిన్ ట్యూమర్ ప్రమాదకరం



బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురయ్యే వ్యక్తులు, పొగతాగే వ్యక్తులకు బ్రెయిన్ ట్యూమర్ సమస్య తీవ్రంగా ఉంటుంది.

- డా.విశ్వకుమార్, న్యూరోసర్జన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

మెదడు కణతులను బట్టి చికిత్స



మెదడులో ఏర్పడిన కణితులను గ్రేడ్-1, 2, 3, 4 విభాగాలుగా విభజించి చికిత్స అందిస్తారు. కణితుల స్థానంపై ఆధారపడి వైద్యం ఉంటుంది. గ్రేడ్ 1, 2 లో ఉన్న కణితులు 3 సెం.మీలు ఉంటే తక్కువగా ఉండే రేడియేషన్ ద్వారా తగ్గించవచ్చు.

- డా.ఎన్.సుమంత్ కుమార్, న్యూరోసర్జన్, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

గురుకులాల్లో సీట్లు పెంచాలి



డీసీవో శ్రీదేవికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 7: ఉమ్మడి జిల్లాలో ఉన్న డా. బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో సీట్లు సంఖ్య పెంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్ నాయుడు కోరారు. శుక్రవారం డీసీవో శ్రీదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో చాలా మంది పేదవారు వలసలు వెళ్తున్నారని, తల్లిదండ్రులు వారి వెంట తమ పిల్లలను తీసుకెళ్తున్నారన్నారు. దీంతో వారి చదువులు మధ్యలో ఆగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినా జిల్లాలో సరిపడ సీట్లు లేకపోవడం వలన విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోతున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అదనంగా మరిన్ని సీట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో తిరుపాల్, రాజు, విజయ్, వెంకటేశ్ ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 7: విద్యార్థులు కష్టపడి చదువుకుని అన్ని రంగాలలో రాణించాలని అవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. సీపీఎం నాయకులు అబ్దుల్‌దేశాయ్ కుమార్తె సానియా దేశాయ్ నీట్ ఫలితాలలో ప్రతిభ కనబరచి అత్యధికంగా మార్కులు సాధించినందుకు శుక్రవారం కార్యాలయంలో సన్మానించారు. ఇక్బాల్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అవాజ్ కమిటీ ప్రోత్సహిస్తుందన్నారు. రాబోయే కాలంలో ప్రజలకు సేవలు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి షేక్ మహ్మద్ షరీఫ్, ఇలియాజ్, సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టీజీ భరత్‌కు శుభాకాంక్షలు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే టీజీ భరత్‌ను ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన్ను పూల మాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు.



టీజీ భరత్‌ను శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

బస్తిపాటి నాగరాజుకు కేంద్రమంత్రి పదవి ఇవ్వాలి

కర్నూలు(అర్బన్), జూన్ 7: సామాజిక వర్గాల సమీకరణలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి కార్యాలయంలో మదాసి కురువ/మదారి కురువ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్నతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో రాజకీయంగా అణగారిన సామాజిక వర్గమైన కురువలను గుర్తించి కర్నూలు ఎంపీ స్థానాన్ని కేటాయించిన టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కురువలను గుర్తించి మరోసారి రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చారని, బడుగు, బలహీన వర్గాలకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయేనని రుజువు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, గోవిందు, కృష్ణయ్య, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిగ్రీ 4వ సెమిస్టర్‌లో 9 మంది డీబార్

కర్నూలు(అర్బన్), జూన్ 7: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలో 9 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కన్వీనర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 6,522 మంది దరఖాస్తు చేసుకోగా 5,968 మంది మాత్రమే పరీక్షలు రాశారన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ



గాయపడ్డ వ్యక్తిని పరామర్శిస్తున్న గౌరు వెంకటరెడ్డి

ఓర్వకల్లు, జూన్ 7: మండలంలోని మీదివేముల గ్రామంలో వైసీపీ నాయకులు చేసిన దాడిలో టీడీపీ కార్యకర్తలు నాగరాజు, శ్రీనివాసులు, రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య తదితరులు గాయపడ్డారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరిని టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 7: స్థానిక ముజఫర్‌నగర్‌లోని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో టీసీ లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జేఎన్ శేషయ్య, కే. సుధాకరప్ప శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఎస్ఎం జయరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కౌన్సిల్ డి.రాముడు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వాలి

సి. బెళగల్, జూన్ 7: రైతులకు విక్రయించే సీడ్స్ విత్తనాల బిల్లులను రైతులకు తప్పనిసరి అందజేయాలని వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సీడ్స్ దుకాణం యజమానులకు సూచించారు. శుక్రవారం మండలంలో ఉన్న దుకాణాల్లో విత్తనాలను పరిశీలించారు.

దుర్మార్గ పాలన అంతంతో ప్రజలకు విముక్తి

● టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో భారీ వర్షాలు
● నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూన్ 7: వైసీపీ దుర్మార్గపు పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించిందన్నారు. జగన్ పాలన అంతా అరాచకంగా, విధ్వంసాలతో సాగడంతో ప్రజలకు విరక్తి చెంది కూటమిని గెలిపించడం ఆనందదాయకమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి చొచ్చుకెళ్లాయని, చంద్రబాబు మీద నమ్మకంతో ప్రజలు ఓటు వేసి గెలిపించారని అన్నారు. వైసీపీ పాలనలో బీసీలు, దళితులు, మహిళలపై, రాజకీయ పార్టీల నాయకులపై కక్ష సాధింపులతో దాడులు చేసి అక్రమ కేసులు పెట్టడంతో ప్రజల్లో విసుగువచ్చిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నైరుతి పవనాలు రాష్ట్రానికి ప్రవేశించి రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. ఇది ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రెండు ఎమ్మెల్యేలు మినహా అన్ని ఎమ్మెల్యేల స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు గెలుచుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా, కాపు సంఘం నాయకులు కేవీ మధు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బజారు, కార్యకర్తలు వేణు, వలి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



హుశేనాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

టీడీపీది చారిత్రాత్మక విజయం

● ఆర్‌యూలో చిత్రపటానికి క్షీరాభిషేకం

కర్నూలు(అర్బన్), జూన్ 7: తెలుగుదేశం పార్టీ చారిత్రక విజయం సాధించిందని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు రమేష్, సురేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ఎదుట చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం, చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనలో విద్యాలయాలు మెరుగు పడ్డాయని, ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణకు మారుపేరులా చంద్రబాబు పాలన సాగుతుందని, ప్రజలు అఖండ విజయం అందించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో మీనాక్షిరెడ్డి, అబ్దుల్ రహిమాన్, ఖాజాగౌస్, పీడీ శివ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌యూలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఉద్యోగులు

కోడుమూరులో టీడీపీకి పూర్వవైభవం

గూడూరు, జూన్ 7: కోడుమూరులో 36 ఏళ్లకు టీడీపీ జెండా ఎగురవేశామని టీడీపీ నాయకుడు రేమట వెంకటేష్, టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, జిల్లా మైనార్టీ నాయకుడు డాక్టర్ మన్నన్ బాషా, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నాగప్ప యాదవ్ అన్నారు. శుక్రవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గూడూరులో బాణాసంచా కాల్చి, స్వీట్లు, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలను జరుపుకున్నారు. అనంతరం కర్నూలుకు తరలివెళ్లి జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి సారధ్యంలో టీడీపీ 36 ఏళ్ళ చరిత్రను తిరగరాసి కోడుమూరు నియోజక వర్గంలో టీడీపీకి పూర్వ వైభవం తెచ్చారన్నారు. టీడీపీ నాయకుడు విష్ణవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సారధ్యంలో నియోజక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగనగేరి, కొండిగేరి, మూలగేరి, పడఖాన వీధి, పడమర బీసీ కాలనీ నాయకులు పాల్గొన్నారు.



కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని సన్మానిస్తున్న గూడూరు టీడీపీ నాయకులు

గౌరు చరిత విజయంతో టీడీపీ ఆనందోత్సాహాలు

కల్లూరు, జూన్ 7: పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గౌరుచరిత 40,591 ఓట్ల అత్యధికతో గెలిచి విజయభేరి మోగించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గౌరు నివాసానికి చేరకుని గజమాలలతో గౌరు దంపతులను ఘనంగా సన్మానించారు. జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు శుక్రవారం గౌరు దంపతులను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులు గౌరు నివాసానికి చేరుకుని పూలబొకేలు, స్వీట్లు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఓర్వకల్లు, గడివేముల, కల్లూరు రూరల్, అర్బన్, పాణ్యం మండలాల నుండి వేల సంఖ్యలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున గౌరు నివాసానికి చేరుకుని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మకు శాలువాలు కప్పిల సన్మానించారు.

● గౌరుచరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి కల్లూరు అర్బన్ 20వ వార్డు టెలికాంనగర్‌లో టీడీపీ నాయకులు అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేశారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. వార్డు నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.



గౌరు దంపతులను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కోడుమూరు (రూరల్), జూన్ 7: మండలంలోని కొత్తూరు ప్యాలకుర్తి గ్రామాల మధ్య జరిగిన బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోడుమూరుకు చెందిన తిమ్మన్న లారీ క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కర్నూలు నుంచి బైక్‌పై కోడుమూరు వస్తున్నారు. అయితే కొత్తూరు దాటిన తర్వాత ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొని కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే టీజీ భరత్ కటౌట్‌కు క్షీరాభిషేకం



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 7: కర్నూలు ఎమ్మెల్యేగా టీజీ భరత్ ఘన విజయం సాధించడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద 50 అడుగుల టీజీ భరత్ కటౌట్‌ను ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. సీనియర్ నాయకులు బొల్లెద్దుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు అందరూ పాల్గొని బాణాసంచా పేల్చి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే టీజీ భరత్ నాయకత్వంలో కర్నూలు నగరం రానున్న రోజుల్లో ఎంతో అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు.

గౌరు చరిత దంపతులకు అభినందనలు



గౌరు చరిత దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 7: పాణ్యం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన గౌరు చరితమ్మను, టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డిని పీఆర్‌టీయూ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు బుగ్గన్న, బాబురావు, నాగభూషణ్‌గౌడు, శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, వీరారెడ్డి, నాగేశ్వరయ్య, ఓర్వకల్లు మండల బాధ్యులు శ్రీనివాసరెడ్డి జాగిర్దార్, రత్నకుమార్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, సోదర సంఘ మిత్రులు రఘు, హుశేన్, రాజు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అంతకుముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

మలేరియాను తరిమికొడదాం

మలేరియా వ్యతిరేక మహోత్సవం ర్యాలీ



కోడుమూరు ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు, జూన్ 7: మలేరియాను తరిమికొట్టాలని విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న అన్నారు. మలేరియా వ్యతిరేక మహోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వణకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వికారం లేదా వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను వెంటనే సంప్రందించాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించి నీటి నిల్వలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది నరసప్ప, కమాల్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు విద్యుత్ కోత

కల్లూరు, జూన్ 7: నెలవారీ విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్‌కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఓల్డ్‌టౌన్, కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్, బి.క్యాంపు, సంతోష్‌నగర్, పవర్‌హౌస్, బళ్లారిరోడ్ సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందని ఏడీఈ12 తెలిపారు. నగరంలోని విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

భారీవర్షానికి ఇళ్లలోకి వరద

● మౌలిక వసతులు కల్పించాలంటున్న కాలనీ వాసులు

కల్లూరు, జూన్ 7: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పందిపాడు సమీపంలోని ఇందిరమ్మ కాలనీ, జగనన్నా హౌసింగ్ కాలనీలో ఇళ్లలోకి వరద చేరింది. కాలనీలో సరైన రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లలోకి వర్షపునీరు వస్తుందన్నారు. కలెక్టర్, నగరపాలక సంస్థ అధికారులకు కాలనీ సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జగనన్నా హౌసింగ్ కాలనీలో ప్రజల సమస్యలను పరిష్కరించయాలని కోరుతున్నారు.

విద్యుత్ సమస్యపై అప్రమత్తంగా ఉండండి



ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 7: వర్షాలు పడుతున్న కారణంగా కరెంటు సమస్యలు రాకుండా ఎలక్ట్రికల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు, ఎలక్ట్రికల్ ఇంజినీర్లు సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు ఆసుపత్రిని సందర్శించి కొన్ని సూచనలు చేయడం జరిగిందని, ఆ సూచనల మేరకు పనులు పూర్తి చేయాలని, క్యాంపస్‌లో అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను రూ.4 లక్షలతో సర్వీసింగ్ చేయించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న 3 జనరేటర్లకు కంపెనీ ఇంజనీర్లు పిలిపించి 3 సంవత్సరాల నుంచి మరమ్మతులు కానందు వల్ల వాటికి సర్వీసు చేయించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో ఎలక్ట్రికల్ సిబ్బంది ప్రతి రోజు షిఫ్టుల వారిగా విధులు నిర్వహించేలా చూడాలని సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావును ఆదేశించారు. సమీక్షలో ఏఆర్ఎంవో ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డా. వెంకటరమణ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, జేఈ సెల్వం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా. శివబాల పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోండి

కోడుమూరు (రూరల్), జూన్ 7: ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయాధికారి శుక్రవారం తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడుతూ విత్తన కొనుగోలు చేసే సమయంలో రశీదు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఆర్బీకేల్లో కందులు, కొర్రలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. మంచి వర్షాలు కురుస్తున్నందున విత్తు పనులు ముమ్మరం చేసుకోవచ్చని చెప్పారు. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు.



విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న ఏపీ జేఏసీ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 7: జిల్లాలో ఇటీవల సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఏపీజేఏసీ నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ అనారోగ్యం, వివిద కారణాల చేత ఉద్యోగులు ఎన్నికల విధులకు హాజరు కాలేదని అన్నారు. సస్పెండ్ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి తిరిగి ఉద్యోగులను విధుల్లోకి చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ హృదయ రాజు, జిల్లా చైర్మన్ వెంగల్ రెడ్డి, నగర అధ్యక్షులు కాశన్న, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి పాల్గొన్నారు.

వాల్మీకులకు మంత్రి పదవులు ఇవ్వాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 7: కేంద్ర, రాష్ట్ర మంత్రి వర్గంలో వాల్మీకి బోయలకు మంత్రి పదవులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం వాల్మీకి యువసేన కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలో అత్యధిక జనాబా కలిగిన వాల్మీకి బోయలు ఎంపీ, ఎమ్మెల్యేలుగా అంబికా కృష్ణ, కాల్వ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, పార్థసారధి ఎన్నికయ్యారన్నారు. వీరికి కేంద్ర, రాష్ట్ర కేబినెట్‌లో స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టీజీ భరత్‌తో నగర అభివృద్ధి

కర్నూలు(కల్చరల్), జూన్ 7: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే టీజీ భరత్‌తో నగర అభివృద్ధి జరుగుతుందని ఆయనను గెలిపించిన బ్రాహ్మణ సామాజిక వర్గంతో పాటు ముస్లిం, క్రిస్టియన్‌లకు, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి సభ్యుడు సముద్రాల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం నగరంలోని కోట్ల సర్కిల్‌లో గల టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో సముద్రాల శ్రీధర్‌బాబుతో పాటు కర్నూలు పార్లమెంటు బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు రవిచంద్ర శర్మ, కర్నూలు అసెంబ్లీ కన్వీనర్ దర్భాడ ఆనందరావు, బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, కార్యదర్శి కంచు గంటల శ్యాం సుందర్‌రావు, హరి శర్మ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



కాల్వబుగ్గలో పొంగి పొర్లుతున్న కోనేర్లు

ఓర్వకల్లులో భారీ వర్షం

ఓర్వకల్లు, జూన్ 7: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఓర్వకల్లులోని జాతీయ రహదారిపైన ఉన్న కుందూ వాగు నీటి ప్రవాహంతో పొంగి పొర్లుతోంది. అలాగే జీవేశ్వరస్వామి ఆలయం ఎదురుగా బ్రిడ్జిపై ప్రవాహం పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే పున్నమి రెస్టారెంటులో వర్షపు నీటితో వాగు రావడంతో సగం వరకు నీటితో మునిగిపోయింది. అలాగే అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీటితో పొంగిపొర్లుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఓర్వకల్లులో కుందూ వాగు పరవళ్లు

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ప్రజాపాలన అందిస్తాం: ఎమ్మెల్యే కేఈ


సుబ్బరాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

వెల్దుర్తి, జూన్, 7: ప్రజాపాలన అందిస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఇటీవల కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ నాయకుడు సుబ్బరాయుడును బొమ్మిరెడ్డిపల్లెలో శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ నిరకుంశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. మొదటిసారి మండలానికి వచ్చిన ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జయరాముడు, లక్ష్మీరెడ్డి, రామకృష్ణాచారి, రామకృష్ణ, సుధాకర్‌గౌడు, అమర్‌నాథ్‌గౌడు, కోదండపాణి, లక్ష్మీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పోలీసు అధికారులు

పత్తికొండ, జూన్ 7: ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును పోలీసు అధికారులు, సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సిఐలు మురళీమోహన్, ప్రవీన్‌కుమార్‌రెడ్డిలతోపాటు ఎస్‌ఐ లు, సిబ్బంది ఎమ్మెల్యే స్వగృహంలో కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో శాంతభద్రతల పరిరక్షణకు పోలీస్ పని చేయాలని, ప్రజా జీవనానికి ఇబ్బందులు కలిగించే అసాంఘిక కార్యక్రమాలపై గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.

అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

ఆదోని, జూన్ 7: అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని టీడీపీ సీనియర్ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ అన్నారు. శుక్రవారం ఆమె స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆదోనిలో ఉన్న వైసీపీ లీడర్లు కొంతమంది భూకబ్జాలకు పాల్పడుతూ పబ్బం గడిపారన్నారు. గ్రామాల్లో, పట్టణంలో ఎక్కడ కూడా అభివృద్ధి అనేది లేదని అన్నారు. ఉత్తుత్తి బటన్ నొక్కిన వైసీపీకి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చారని, ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని ఎద్దేవా చేశారు. సమావేశంలో గుడిసె శ్రీరాములు, రామ్‌భీం నాయుడు, కపటి మాధవ, మారుతి పాల్గొన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు

తుగ్గలి, జూన్ 7: పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు గెలుపొందాలని రాతన గ్రామంలోని సుంకులమ్మ అమ్మవారికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మొక్కుకోవడంతో కేఈ శ్యాంబాబు గెలవడంతో శుక్రవారం మండల పరిధిలోని రాతనలో టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, మహిళా మండల అధ్యక్షురాలు ఈరమ్మ, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ఈరన్నస్వామి, కపిలేశ్వరయ్య, మైరాముడు, మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆ హైస్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

కోసిగి, జూన్ 7: కోసిగిలోని రంగప్పగట్టు సమీపంలో ఉన్న మౌంట్ కార్నెల్ హైస్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఈరేష్ అన్నారు. శుక్రవారం అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నా విద్యాధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొత్తగా చేరే విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు రూ.4 వేలు, స్కూల్ ఫీజు రూ.10 వేలు వసూలు చేస్తున్నారని అక్కడకు వచ్చిన ఎంఈవో-2 నాగేశప్పకు తెలిపారు. మౌంట్ కార్నెల్ పాఠశాల యజమాన్యంతో వాగ్వాదం చోటు చేసుకోవడంతో పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంజి, మల్లికార్జున, గురుస్వామి, నరసింహులు, ఆనంద్ పాల్గొన్నారు.

వైద్యులపై ఆగ్రహం

చిప్పగిరి, జూన్ 7: రోగులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న చిప్పగిరి వైద్యులపై మాజీ టీడీపీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కొడుకుకు కుక్క కరవడంతో చిప్పగిరి ప్రభుత్వ వైద్యశాలలో ఇంజక్షన్ వేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్లారు. వందలాది రోగులు వేచి చూస్తున్నా ఆసుపత్రిలోని డాక్టర్ పార్వతమ్మ కంప్యూటర్ గదిలో లెక్కలు చూసుకోవడం ఏమిటని ఆయన మండిపడ్డారు. పరిస్థితి ఇలాగే ఉంటే కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు.

సచివాలయానికి తాళం

కోసిగి, జూన్ 7: కోసిగిలోని సచివాలయం-2లో మధ్యాహ్నం ఒంటి గంటైనా తాళం వేసిన కనిపించింది. సచివాలయాలను పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా కార్యాలయాలకే పరిమితం కావడంతో సచివాలయ ఉద్యోగుల తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయ ఉద్యోగులపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సింగిల్ విండో చైర్మన్ పదవికి రాజీనామా

మద్దికెర, జూన్ 7: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో గల విశాల సహకార సంఘం చైర్మన్ పదవికి సుబ్బయ్య తన రాజీనామా పత్రాన్ని సీఈవో మల్లికార్జునకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగిల్ విండో చైర్మన్‌గా ఉంటూ రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించానని అన్నారు. సహకార సిబ్బంది తనకు సహకరించారని గుర్తు చేశారు. వైసీపీ ఓడిపోవడం వల్ల నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భారీ వర్షం


తుగ్గలి-మామళ్లకుంట రహదారిలో కొట్టుకుపోయిన కల్వర్టు

తుగ్గలి చెరువు వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

తుగ్గలి, జూన్ 7: భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో రైల్వే బ్రిడ్జి కింద వాహనాలు నిలిచిపోవడంతోపాటు కల్వర్టులు కొట్టుకుపోయాయి. బ్రిడ్జి వద్ద వాహనాలు నీటి ప్రవాహానికి నిలిచిపోయాయి. శుక్రవారం సాయంత్రం తుగ్గలి మండలంలో తుగ్గలి, రాతన తదితర గ్రామాల్లో దాదాపు 56.2 సెం.మీ. వర్షం కురవడంతో తుగ్గలి రైల్వే వంతెన కింద భారీ నీటి ప్రవాహం రావడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అలాగే తుగ్గలి-మామళ్లకుంట గ్రామాల మధ్య ప్రధాన రహదారిలో భారీ వర్షానికి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో దాదాపు మామళ్లకుంట, పోతికొండ, ఎద్దులదొడ్డి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే తుగ్గలి చెరువుకు భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పత్తికొండలో భారీ వర్షం

పత్తికొండ, జూన్ 7: పత్తికొండలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పలుచోట్ల కాలనీలు జలమయమయ్యాయి. పత్తికొండ చెరువుకు నీరు చేరే బుగ్గ వంక, కట్టు కాలువ వాగులు పొంగి ప్రవహించాయి.

కూలిన మట్టి మిద్దె

వెల్దుర్తి, జూన్, 7: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వెల్దుర్తిలో మట్టి మిద్దె కూలింది. పట్టణం లో 13వ వార్డు రైల్వేస్టేషన్ వీధిలో నివాసం ఉంటున్న షబానా, ఖాజాలు నివాసం ఉంటున్నారు. బస్టాండ్‌లో తోపుడు బండి మీద చిరువ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వారు నివా సం ఉంటున్న ఇంటి పైకప్పు కూలిపోయింది. అదృష్ట వశాత్తు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. నిరాశ్రయులైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


గూళ్యం వేదవతి వద్ద పుట్టిలో ప్రయాణిస్తున్న జనం

వర్షంతో రైతుల్లో హర్షం

హొళగుంద, జూన్ 7: హొళగుంద మండల పరిధి లోని సులువాయి, సమ్మతగేరి, హెబ్బటం, వందవగాలి తోపాటు హొళగుందలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు. రెండు గంటలపాటు కురి సిన వర్షానికి పొలాల్లో నీరు పారింది. ఈ వర్షం పత్తి, మిరప, జొన్న, వేరుశనగ పంటలు విత్తిన రైతులకు ఎంతగానో ఉపకరిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలం మొత్తం మీద 42.52 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పొంగిపొర్లిన వేదవతి

హాలహర్వి, జూన్ 7: హాలహర్విలో భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగిపొర్లాయి. వేదవతికి వరద నీరు భారీగా రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేదవతి దాటేందుకు ఇరు గ్రామాల ప్రజలు పుట్టిలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో రైతులు పొలం పనుల్లో బీజీబీజీ అయ్యారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

ఊరూరా పసుపు పండగే..


నారా లోకేశను కలిసిన టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు


సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మద్దికెర, జూన్ 7: మద్దికెర, హంపా, బసినేపల్లి, ఎడవలి గ్రామాల్లో ఎన్డీయే కూటమి భారీ విజయం కైవసం చేసుకోవడంతో ఊరూ వాడంతా కలిసి పండుగ చేసుకున్నారు. శుక్రవారం మద్దికెరలో టీడీపీ కార్యకర్తలు, అలాగే బసినేపల్లి గ్రామంలో తిమ్మప్ప, హరినాథ్‌గౌడు, శ్రీరాములు ఆధ్వర్యంలో, పెరవలి గ్రామంలో మెడికల్ తిమ్మప్ప, కేవీ రాజేశ్వరిచౌదరి ఆధ్వర్యంలో, ఎడవలి గ్రామంలో ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి జంతు బలులు చేసి సంబరాలు చేసుకున్నారు.

పెద్దఎత్తున టీడీపీలో చేరికలు

ఆదోని, జూన్ 7: ఆదోని పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ, ఎరుకల కాలనీలో నివాసముంటున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. స్థానిక వైసీపీ లీడర్లు టీడీపీలో ఉంటే కేసులు పెడతామని భయపెట్టి వైసీపీలో చేర్చుకున్న వారందరూ కూడా ఇప్పుడు సొంత గూటికి చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తన పని తాను చేసుకపోతుందని, ఎవరి పైన కక్షగట్టే అవసరం తనకు లేదన్నారు. ఇందిరా నగర్ టీడీపీ ఇన్‌చార్జి ఐసీ రామక్రిష్ణ, అడ్వకేట్ ఆధ్వర్యంలో ఎరుకుల కాలనీ వాసులు రామన్న, అంజి, వసంత, హనుమంతు, చిట్టితోపాటు మరో 50 కుటుంబాలు అలాగే లక్ష్మమ్మ నగర్ వైసీపీ నాయకులు వాల్మీకి కృష్ణ, వాల్మీకి నరసన్నతోపాటు మరో 50 కుటుంబ సభ్యులు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు వలి, రంగన్న, శేఖర్, శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన ఉమాపతి నాయుడు

ఆదోని, జూన్ 7: ఆదోని కూటమి బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసినందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశంసించారని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తులిపారు. నారా లోకేశ్‌ను శుక్రవారం ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశామని చెప్పారు. ఆదోని కూటమి బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి 18వేలకు పైగా మెజారిటీ సాధించినందుకు అందరూ కలిసి కట్టుగా చేసిన తీరు అమోఘమని అన్నారని తెలిపారు. మీనాక్షినాయుడు అన్న ఎలా ఉన్నారని ఆరా తీశారని వివరించారు.

నందవరంలో టీడీపీ సంబరాలు

నందవరం, జూన్ 7: రాష్ట్రంలో టీడీపీ రావడం, ఎమ్మిగనూరులో ఎమ్మెల్యేగా బీవీ జయనాగేశ్వరరెడ్డి భారీ మెజార్టీ గెలవడంతో నందవరంలో టీడీపీ నాయకులు గురురాజారావు, మాచాపురం కాశీంవలీ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. గురురాజారావు దగ్గరకు కార్యకర్తలు ర్యాలీగా వచ్చి మిఠాయిలు పంచుకున్నారు. బీవీ జయ నాగేశ్వరరెడ్డికి మంత్రి పదవి రావాలని కోరారు. కార్యక్రమంలో నందవరం మాజీ సర్పంచ్ రామన్నగౌడు, మైనార్టీ నాయకుడు సాధిక్ పాల్గొన్నారు.

దర్గాలో మొక్కులు

కౌతాళం, జూన్ 7: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు కౌతాళంలోని దర్గాలో మొక్కులు తీర్చుకున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన శ్రీజగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు నాయకులు వెంకటపతిరాజుతో కలిసి దర్గా ధర్మకర్త పెద్ద మున్నాపాష స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహలు చేపట్టి రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా స్వామి వారు ఆశీర్వాదం చేయాలని పూజించారు. అనంతరం దర్గాలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజబాబు, సిద్దు, మంజునాథ, రాజానందు, చూడి శివమూర్తి, అమ్మవలి, క్రిష్ణకాంత్, తిప్పలదొడ్డి నీలకంఠరెడ్డి, మల్లయ్య, శ్రీరాములు, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, జనసేన కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో నడిపిస్తాం

కోసిగి, జూన్ 7: టీడీపీ కూటమి విజయంతో కోసిగి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగిలోని ముత్తురెడ్డి నివాసానికి మండల పరిధిలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముత్తురెడ్డిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అలాగే పల్లెపాడు రామిరెడ్డిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, తోవి రామక్రిష్ణ, చింతలగేని నర్సారెడ్డి, తాయన్న, గాలెం వీరేష్, గణపతి, పోతుల వీరారెడ్డి, నర్సన్న, తదితరులు ఉన్నారు.

● వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కళాకారులను, కళామతల్లిని అవమానించడంతోనే ఘోర పరాజయం పాలయ్యారని సినిమా హీరో ఎస్‌వీ మంజునాథ్ అన్నారు. శుక్రవారం ఆయన చంద్రబాబుకు, జనసేనాని పవన్ కళ్యాణ్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బీజేపీ కార్యాలయంలో సంబరాలు

ఆదోని టౌన్, జూన్ 7: దేశంలో సుపరిపాలన నరేంద్ర మోదీతోనే సాధ్యమవుతుందన్న విషయాన్ని దేశప్రజలు విశ్వసిస్తున్నారని ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైందని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు విట్టా రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా భారీగా బాణసంచా పేల్చి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్, శ్రీనివాస్, ఆచారి, అంజయ్, నాగార్జున, విజయ్ కృష్ణ, రమాకాంత్, జితేంద్ర పాల్గొన్నారు.

రాఘవేంద్రరెడ్డికి అభినందనల వెల్లువ

మంత్రాలయం, జూన్ 7: మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు మండలాల నుంచి రాఘవేంద్రరెడ్డి గ్రామమైన మాధవరం వచ్చి సన్మానించి అభినందనలు తెలిపారు. రాఘవేంద్రరెడ్డి ఇంటి ఆవరణంలో తెలుగు తమ్ముళ్లతో సందడిగా మారింది. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, గూర్మింటి భీమిరెడ్డి, బొమ్మిశెట్టి నాగరాజు, కౌలుట్లయ్య, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, రామక్రిష్ణ, కేశన్న, పెద్ద ఎత్తున నాలుగు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన ఇందిరానగర్ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు

ఒక్కరోజు ఎస్‌ఐ


వెంకట్రామిరెడ్డి

మద్దికెర, జూన్ 7: మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తున్న వెంకట్రామిరెడ్డి ఎస్‌ఐగా పదోన్నతి పొంది ఒక్క రోజు మాత్రమే పని చేశాడు. మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లుగా ఏఎస్‌ఐగా పని చేస్తున్న వెంకట్రామిరెడ్డి ఎస్‌ఐ పోస్టు కోసం ఎదురు చూస్తున్నాడు. మే 31వ తేదీన జిల్లా ఉన్నతాధికారులు ఎస్‌ఐగా పదోన్నతి ఇచ్చారు. అదే రోజు పదవి విరమణ చేశారు. అయితే. ఎక్కడ కూడా ఆయనకు పోస్టింగ్ ఇవ్వకపోవడంతో మద్దికెర స్టేషన్‌లోనే పదవీ విరమణ చేశాడు. శుక్రవారం మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో పదవీ విరమణ పొందిన ఎస్‌ఐ వెంకట్రామిరెడ్డిని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు, ఏఎస్‌ఐలు ఫణిరాజు, చెన్నయ్య, శంకర్, సిబ్బంది ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

మద్దికెర, జూన్ 7: మండలంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి రంగస్వామి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేర్చిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, బట్టలు, బ్యాగులు, బూట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేగాక పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో పాటు కోడిగుడ్డు అందుతుందని తెలిపారు. ప్రతి పేద తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

పత్తికొండ టౌన్, జూన్ 7: పత్తికొండ పట్టణంలో మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతులకు మిగిలి ఉన్న సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విక్టర్ శామేల్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో మిగిలి ఉన్న 7, 8, 9 తరగతులకుగాను ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి చదివిన స్టడీ సర్టిఫికెట్లు, విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, పాస్‌ఫొటోలు పాఠశాలలో ఈ నెల 12వ తేదీలోపు అందజేయాలన్నారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం విద్యార్థుల మెరిట్ ఆధారంగా సీట్ల ఎంపిక ఉంటుందని తెలిపారు.

వజ్రం లభ్యం

తుగ్గలి, జూన్ 7: వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఓ కూలీకి వజ్రం లభ్యమైంది. శుక్రవారం మండల పరిధిలోని బొల్లవానిపల్లెకు చెందిన ఓ వ్యవసాయ కూలీకి వజ్రం లభ్యం కావడంతో జొన్నగిరికి చెందిన వజ్రాల వ్యాపారి రూ.22 వేలు, తులం బంగారుకు కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసినపుడు ఈ ప్రాంతంలో విరివిగా వజ్రాలు దొరుకుతుంటాయి.

కార్యకర్తలకు రుణపడి ఉంటాం


తుగ్గలిలో నాగేంద్ర దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తుగ్గలి, జూన్ 7: పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు గెలుపు కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు రుణ పడి ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి అన్నారు. శుక్రవారం తుగ్గలిలో నాయకులు, కార్యకర్తలు నాగేంద్ర దంపతులను ఊరేగించారు. భారీ గజమాలలు వేసి సన్మానించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి చెందాలంటే కార్యకర్తలే పునాదులు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఈశ్వరప్ప, రంగస్వామి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుగ్గలి, జూన్ 7: మండలంలో శనివారం విద్యుత్ మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం తుగ్గలి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గత పది రోజుల నుంచి మండలంలో కురుస్తున్న గాలి, వాన, ఉరుములు, మెరుపులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, విద్యుత్ తీగలు వేలాడడం వంటి సమస్యలు ఉన్నాయని అన్నారు. వాటిని మరమ్మతులు చేయడం కోసం శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల రథోత్సవం

మంత్రాలయం, జూన్ 7: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం జ్యేష్ఠ పాడ్యమిని పురస్కరించుకుని అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథాన్ని అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజల సేవ నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి గ్రామ దేవత మంచా లమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దాం

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 7: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని ఆదోని గ్రీనరీ డెవలప్‌మెంట్ సంస్థ సభ్యులు మిరియాల శ్రీధర్ కోరారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎస్కేడీ కాలనీ నాలుగు రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రీనరీ క్లబ్ సభ్యులు లలిత, హరిత, కోమల, వినీత, విరుపాక్షిరెడ్డి, ఉమాకోటేశ్వరి పాల్గొన్నారు.

ఎరువుల షాపులు తనిఖీ

ఆస్పరి, జూన్ 7: వర్షాకాలం ప్రారంభం కావడంతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అమ్ముకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేంద్ర కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రం ఆస్పరిలో ఎరువుల షాపులను ఆయన తనిఖీ చేశారు. పత్తి, ఇతర ఖరీఫ్ విత్తనాల ప్యాకెట్లు, మందులు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎమ్మిగనూరు, జూన్7: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న వడ్డే బజారి కుటుంబాన్ని ఆదుకోవాలని అఖిలభారత రైతు సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు వడ్డే బజారి కుటుంబాన్ని పరామర్శించారు. రైతు ఖరీఫ్, రబీ సీజన్లలో మిరప తోపాటు ఇతర పంటలను సాగు చేశాడన్నారు. పంట నష్టం జరిగి అప్పులు తీర్చే దారిలేక మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతుకుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

తప్పిన ప్రమాదం

ఎమ్మిగనూరు, జూన్ 7: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం విద్యుత్ సర్వీసు తెగిపోవటంతో తృటిలో ప్రమాదం తప్పింది. వారం రోజుల నుంచి అడపా దడపా వర్షం కురిసింది. అలాగే శుక్రవారం సైతం చిన్నపాటి వర్షం రావటంతో విద్యుత్ స్తంభం దగ్గర ఉన్నట్టుండి సర్వీసు వైరు షార్టుసర్క్యూట్‌కు గురై తెగిపడింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదు తప్పింది. దీంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు వాహనాల వేలం

ఎమ్మిగనూరు, జూన్ 7: ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిదిలో అక్రమంగా మద్యం రవాణాచేస్తు పట్టుబడిన వాహనాలను ఈ నెల 8న వేలం వేస్తున్నట్లు డీఎస్పీ సీతారామయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు టౌన్, రూరల్, పెద్దకడుబూరు పోలీసు స్టేషన్ పరిదిలో అక్రమంగా మద్యం రవాణా చేస్తు పట్టుబడిన ఐదు వాహనాలకు వేలం వేస్తున్నట్లు తెలిపారు.

ఏకగ్రీవ ఎన్నిక

ఆలూరు, జూన్ 7: ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ఆదోని డివిజన్ అధ్యక్షులుగా శివ, చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆదోని డివిజన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదోని డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆలూరు లైన్‌మెన్ నరసప్ప, డివిజనల్ సెక్రటరీగా లక్ష్మణ, కోశాధికారిగా గోవిందరాజులు ఎన్నికయ్యారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

హాలహర్వి, జూన్ 7: ప్రతి ఇంటా మొక్కలు నాటి పల్లెలు పచ్చని తోరణంగా మార్చాలని ఎంపీడీవో ఆంథోని అన్నారు. శుక్రవారం బాపురం గ్రామంలో మాజీ సర్పంచులైన సోమశేఖరయ్య స్వామి, నాగేంద్ర ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటి వదలకుండా బాధ్యతతో పెంచాలని కోరారు.

మూతబడిన సచివాలయం

హాలహర్వి, జూన్ 7: చింతకుంట సచివాలయంలో అధికారులు లేక మూతబడింది. ప్రజా సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సచివాలయం సిబ్బంది, ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. సిబ్బంది వెళ్లి పోవడంతో సచివాలయానికి తాళం వేశారు. పనుల కోసం వచ్చిన గ్రామస్థులు సచివాలయం మూత బడటంతో వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది.

తాగునీటి సమస్య పరిష్కారం

ఎమ్మిగనూరు, జూన్ 7: ఎన్నికల ప్రచార సమయంలో రెండో వార్డులో తాగునీటి సమస్య ఉందని వార్డు ప్రజలు బీవీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎన్నికలు ముగిసిన వెంటనే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాలతో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జి తురేగల్ నజీర్‌లు వార్డులో పర్యటించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.